క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దఅడిశర్లపల్లి : సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని ఘనపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ కావ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆమె తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నిడమనూరు : ఈ నెల 24న నిడమనూరు మండల పరిషత సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

బీసీ గురుకులంలో ప్రవేశాలు ప్రారంభం

నాగార్జునసాగర్ : మహాత్మాజ్యోతిబాపూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభమైనట్లు సాగర్ కళాశాల ప్రిన్సిపాల్ రజనీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల విద్యాలయ సంస్థ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి సీటు పొందిన విద్యార్థుల ఎంపికకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో హాజరుకావాలని కోరారు. అదే విధంగా ఇటీవల నిర్వహించిన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు పాఠశాల నుంచి 8మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని తుంగపాడు గ్రామ సమీపంలోని రాజీవ్ స్వగృహా కాలనీలో రోడ్డుకు అడ్డంగా తవ్వారని వారిపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. 20 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని, తమ కాలనీకి గతంలో ఉన్న దారిని జేసీబీ ద్వారా తవ్వించారని, దీంతో కాలనీకి వెళ్లేందుకు రోడ్డు లేకుండా పోయిందని, ఈ ప్రాంతానికి చెందిన ధీరావత్ చిన్న, సేవ్లానాయక్, రమేష్‌నాయక్ 20 ఏళ్లుగా ఉంటున్న దారిని తవ్వించారని, అధికారులు ఈ విషయంపై స్పందించి దారిని తవ్విన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో కాలనీకి చెందిన శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, ధనలక్ష్మి, షోయబ్, శ్రీధర్, జానీబేగం, ఫర్వీన్, షాహిన్, రంజాన్‌బి, సురమ్మ, శేఖర్, బుచ్చమ్మ, పిచ్చమ్మ, రాము, లక్ష్మమ్మ, రాములమ్మ, రియాజ్, కిశోర్, హసీమ్ తదితరులు ఉన్నారు.

భైరం దేవేంద్రకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన భైరం దేవేంద్ర ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో మంగళవారం సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్ భైరం దేవేంద్ర ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, త్రిపురారం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, వెంకట్ రెడ్డి, రైతుబంధు మాజీ సభ్యులు అనుముల శ్రీనివాస్ రెడ్డి, చింతకాయల యాదయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

మాడుగులపల్లి : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మాడుగులపల్లి ఎస్ఐ శోభన్‌బాబు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. రీచ్‌ల నుంచి ఇసుక తెచ్చే వారు అనుమతి పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. అనుమతి ఉన్నా రాత్రివేళ తరలిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

ఈదురుగాలులకు కోళ్ల షెడ్లు ధ్వంసం



దుగ్గెపల్లిలో ధ్వంసమైన కోళ్ల షెడ్డు

త్రిపురారం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులు గాలి దుమారంతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులకు దుగ్గెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దుర్గానగర్‌లో రైతు పెరుమాళ్ల జ్యోతికి చెందిన రెండు కోళ్ల షెడ్లు ధ్వంసమయ్యాయి. రూ.8లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతోంది.

ప్రశ్నార్థకంగా వానాకాలం సాగు



నీళ్లు లేక వెలవెలబోతున్న కన్నెకల్ నాగుల చెరువు



ఎండిపోయిన చెరువుపల్లి చెరువు

- మైదానాలుగా చెరువులు
- అడుగంటిన భూగర్భ జలాలు
- సాగర్ జలాల పరిస్థితి అంతంతే
- వరుణుడిపైనే అన్నదాతల ఆశలు

మాడుగులపల్లి : మండలంలోని దాదాపు చెరువులన్నీ ఎండిపోయి చుక్కనీరు లేక నెర్రెలువారి కనిపిస్తున్నాయి. రెండేళ్లుగా సక్రమంగా వర్షాలు కురవకపోవడంతో నీరు చేరక క్రీడా మైదానాలను తలపిస్తున్నాయి. మండలంలో సుమారు 68 పైగా చెరువులున్నాయి. వీటిలో కొన్ని వర్షాధారంగా నిండుతుండగా మరికొన్నింటికి గర్, మూసీ కాల్వల ద్వారా వచ్చే ప్రవాహమే ఆధారం. తీవ్ర వర్షాభావం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులోనూ ఆశించిన మేర నీరు లేకపోవడంతో చెరువులు నింపేందుకు ఆస్కారం లేకుండా పోయింది. సాగర్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాలైన గార్లకుంటపాలెం, కన్నెకల్లు, నారాయణపురం, మాచినపల్లి, ధర్మపురం, గోపాలపురంతోపాటు మిర్యాలగూడ పరిధిలోని తోపుచర్ల, ఇందుగుల, మాదుగులపల్లి, కుక్కడం తదితర గ్రామాల చెరువుల నింపేందుకు సాగర్ లోలెవల్ కాల్వ (ఎల్ఎల్‌సీ) నీరే ఆధారం. సాగర్‌లో 545 అడుగులకుపైగా నీటి నిల్వ ఉంటేనే లోలెవల్ కాల్వకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుంది. రెండేళ్లుగా లోలెవల్ కాల్వ వదలకపోవడంతో చెరువుల్లో నీరు లేక భూగర్భ జలాలు అడుగంటి సాగునీటికి రైతులు ఇబ్బంది పడ్డారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని భీమనపల్లి, చెర్లగూడెం, పాములపాడు, చిరుమర్తి, కల్వెలపాలెం గ్రామాల చెరువులకు మూసీ కాల్వల ద్వారా నీరు చేరుతుంది. సకాలంలో వర్షాలు పడకపోవడం, ఆయకట్టు రైతులు సాగుకు వినియోగించడంతో నిల్వలు నిండుకున్నాయి. చెర్లగూడెం చెరువులో మాత్రమే కొద్దిగొప్ప నీరు కనిపిస్తోంది.

అడుగంటిన భూగర్భ జలాలు..

చెరువుల్లో నీరు లేకపోవడంతో మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. బోరుబావులు ఒట్టిపోతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలాచోట్ల 300 ఫీట్లకు పైగా బోరు వేసినా నీళ్లు రావడం లేదు. సకాలంలో వర్షాలు కురిసి వాగులు వంకలు పొర్లితే తప్ప ఈ సారి ఖరీఫ్‌లో పంటలు సాగు చేయలేని పరిస్థితి. ఇటీవల ఉపరితల ఆవర్తన ప్రభావంతో అడపాదడపా కురిసిన జల్లులకు రైతులు దుక్కులు దున్నుకున్నారు. అదునుకు వానలు పడితే విత్తనాలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

వరి సాగుకు ఆస్కారం ఉండదు



సకాలంలో వర్షాలు పడకుంటే వరి సాగు చేసే అవకాశమే ఉండదు. అప్పుడప్పుడు కురిసే వానలకు మెట్ట పంటలు సాగు చేసుకోవాల్సి ఉంటుంది. చెరువు ఎండిపోయిన నాటి నుంచి బోర్లుపోయక ఇబ్బందులు పడుతున్నాం. వేసవిలో తోటలను రక్షించుకునేందుకు చాలా కష్టపడ్డాం.

– సర్నాల నాగరాజు, కన్నెకల్, రైతు

వర్షాలు కురిస్తేనే సాగు



వర్షాలు కురవకపోవడంతో చెరువులో నీరు పూర్తిగా అడుగంటింది. గతంలో పుష్కలంగా నీరుండడంతో బోర్లు బాగా పోసి సాగునీటికి కొరత ఉండేది కాదు. మరో 20 రోజుల్లో మృగశిర కార్తె వస్తుంది. అప్పటి నుంచి బాగా వర్షాలు కురిస్తేనే పంటలు సాగు చేసే వీలుంటుంది.

– మొగిల్ల జానకిరాములు, ధర్మాపురం, రైతు

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు



సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్, చిత్రంలో జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్



సభకు హాజరైన పట్టభద్రులు, కార్యకర్తలు

హాలియా : వరంగల్–నల్లగొండ–ఖమ్మం నియోజకవర్గ పట్టభద్రుల ఉప ఎన్నికలో కాంగ్రెస్ నమ్మి మరోసారి మోసపోవద్దని, ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం హాలియా పట్టణంలోని లక్ష్మీ నరసింహ గార్డెన్‌లో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సభలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. 30వేల ఉద్యోగాలు ఇచ్చినా చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ఏమైనా వాటికి నోటిఫికేషన్ ఇచ్చారా.. రాత పరీక్ష పెట్టారా.. ఇంటర్వ్యూ చేశారా అని ప్రశ్నించారు. సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ మరోసారి మోసం చేసిందని విమర్శించారు. అభ్యర్థి రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులంతా గతంలో మంచి వ్యక్తులనే మండలి పంపారన్నారు. మండలి సభ అంటే మేధావులను ఎన్నుకుంటారే తప్ప.. మోసగాళ్లను కాదన్నారు. బీజేపీలో చాలా ఏళ్లు పని చేశానని, ఎన్నో పోరాటాలు చేశానని, కేసీఆర్ తనను పిలిచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించారని తెలిపారు. ఈనెల 27న జరిగే ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే రూపాయి తీసుకోకుండా సేవ చేస్తానని హామీ ఇచ్చారు. సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్, ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్, అప్కాబ్ మాజీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి, వివిధ మండలాల ఎంపీపీలు, అధ్యక్షులు,నాయకులు పాల్గొన్నారు.

బస్సులెక్కి బహుమతులు పొందండి



ప్రయాణికురాలికి బహుమతి అందజేస్తున్న డీఎం

మిర్యాలగూడ టౌన్ : ప్రతి ఒక్కరూ సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులను ఎక్కి బహుమతులు పొందాలని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ అన్నారు. మంగళవారం ఈనెల 4న జీవీ మాల్ సౌజన్యంతో 'ఆర్టీసీ బస్సెక్కండి..బహుమతి పొందండి' అనే కార్యక్రమంలో నిర్వహించిన లక్కీ డ్రా విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే వారు దిగి వెళ్లే సమయంలో టికెట్ వెనుక అడ్రస్, ఫోన్ నంబర్లు రాసి బస్సు డ్రైవర్ వెనుకాలో ఉన్న బాక్స్‌లో వేయాలని సూచించారు. వేసిన 15 రోజుల తర్వాత డ్రా తీసి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మంగళవారం రోజు తీసని డ్రాలో ప్రథమ బహుమతి ప్రియాంక(గాంధీనగర్, మిర్యాలగూడ), ద్వితీయ బహుమతి స్వాతి(కట్టవారిగూడెం, గుర్రంపోడు), తృతీయ బహుమతి ప్రవళిక(గాంధీనగర్, మిర్యాలగూడ)లు గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ భారతీబాయి, ఎంఎఫ్ పుప్పాల యాదగిరి, జీవీ మహల్ నుంచి హరి, సంపత్, సాయి తదితరులున్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, చిత్రంలో పల్లా వెంకట్‌రెడ్డి

దేవరకొండ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ,బీఆర్ఎస‌కు తగిన గుణపాఠం చెప్పాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల తరహాల్లోనే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మల్లన్నను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గడిచిన పదేళ్లలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిన విధంగా గతంలో ఏ ప్రభుత్వం మోసం చేయలేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నగేష్, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లా నర్సింహ్మారెడ్డి, సత్యం, వెంకటరమణ, బుచ్చిరెడ్డి, శిరందాసు కృష్ణయ్య తదితరులున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

మిర్యాలగూడ : ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని దామరచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు, ఉద్యోగులకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేసిందన్నారు. కాని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల,నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగునాయక్, సద్దాం, దాసు, వసంత్, చెన్నయ్య, దుర్గాప్రసాద్, వెంకట్‌రెడ్డి, లక్ష్మీనరసింహ, శ్రీనివాస్, షేక్ సుబాని, గాంధీ, పాల్గొన్నారు.

త్రిపురారం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీపీ అనుముల పాండమ్మ నివాసంలో ముఖ్య కార్యకర్తలతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, త్రిపురారం పట్టణ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ఎంపీటీసీ యాదగిరి, చంద్రా రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషిచేయాలి



మిర్యాలగూడ : రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశాభివృద్ధి కోసం రాజీవ్‌గాంధీ అనేక సేవలు అందించారన్నారు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా పేద, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పోరాడారన్నారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, నాయకులు మైబలి వేణుగోపాల్‌రెడ్డి, చిలుకూరి బాలు, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, వెంకన్న, అజహర్, సికిందర్‌బాషా, పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

నాగార్జునసాగర్ : నందికొండలోని పైలాన్‌కాలనీలో మాజీ భారత ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, ముజీబ్, జైరామ్, వేణు, కృష్ణ, విగ్నేష్, అబ్రహం, రాము, చంద్రకాంత్, శివాజీ, గోవింద్ పాల్గొన్నారు.



నాగార్జునసాగర్ : రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

దేవరకొండ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండలోని ఆయన నివాసం వద్ద రాజీవ్ గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వేణుధర్‌రెడ్డి, రేణుక, యూనూస్, రాహత్‌అలీ పాల్గొన్నారు.



మిర్యాలగూడ : రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

ఇన్‌చార్జ్ డీలర్‌కు బాధ్యతలు అప్పగింత

చందంపేట : చందంపేట మండలంలోని బుడ్డోనితండా గ్రామ రేషన్ డీలర్‌పై ఆరోపణలు రావడంతో ఆయన స్థానంలో మరో డీలర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఆర్డీఓ ఆదేశాల మేరకు విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేషన్ డీలర్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తూ బుడ్డోనితండా రేషన్ డీలర్ బాధ్యతలను మరొకరికి అప్పగించినట్లు తెలిపారు. ఆ డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రామ అటాచ్‌మెంట్ మాడ్యూల్‌పై అవగాహన



వివరాలు అడిగి తెలుసుకుంటున్న బృందం

మిర్యాలగూడ : సెంట్రల్ సెక్రటేరియేట్ సర్వీస్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ బృందం ఫౌండేషన్ ట్రెనింగ్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామ అటాచ్‌మెంట్ మాడ్యూల్‌పై అవగాహన కోసం మండలంలోని శ్రీనివాస్‌నగర్‌కు మంగళవారం చేరుకున్నారు. ఎంపీడీఓ ఎం.శేషగిరిశర్మ, ఎంఈఓ ఎం.బాలాజీనాయక్, ఎంపీఓ పద్మ, వీరారెడ్డి, ఏపీఓ కళావతిలు వారికి ఘన స్వాగతం పలికారు. గ్రామీణాభివృద్ధిపై అవగాహన, అధ్యయనం చేస్తారని ఎంపీడీఓ తెలిపారు. మంగళవారం గ్రామంలో జనాభా, గృహాల సంఖ్య తాగునీటి సరఫరా, 24గంటల విద్యుత్ సరఫరా, గ్రామస్తుల జీనోపాధి, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల అమలు, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, అమ్మ ఆదర్శ పాఠశాల యూనిఫాం, కుట్టడం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి అనిత పాల్గొన్నారు.

నిరుద్యోగుల పక్షాన కొట్లాడేది బీజేపీనే

నల్లగొండ టూటౌన్ : ఉద్యోగులు, నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పక్షాన కొట్లాడేది బీజేపీ మాత్రమే అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్ అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఆరు నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఒక బ్లాక్‌మెయిలర్ అని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారీ క్షీనర్సయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి,గోలి మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్, పోతెపాక సాంబయ్య, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయించొద్దు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

చింతపల్లి : అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని చింతపల్లి, కుర్మేడు, వింజమూరు, గొడుకొండ్లలో విత్తన డీలర్ల షాపులను మండల వ్యవసాయ అధికారి పి.శ్రావణికుమారితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తి విత్తన స్టాక్ వివరాలు, ఇన్వాయిస్, అమ్మకం వివరాలు, బిల్ పుస్తకాలను తనిఖీ చేసి మాట్లాడారు.అధిక ధరలకు విక్రయిస్తే చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

రామకృష్ణకు డాక్టరేట్

రామగిరి (నల్లగొండ): నల్లగొండకు చెందిన ఉపాధ్యాయుడు కనకటి రామకృష్ణకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. డాక్టర్ దాశరథుల నరసయ్య పర్యవేక్షణలో నల్లగొండ జిల్లా అభ్యుదయ సాహిత్యం అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఉస్మానియా విశ్వవిద్యాలయం రామకృష్ణకు డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా రామకృష్ణను నాగార్జున ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ తండుకృష్ణ కౌండిన్య, సృజన సాహితీ అధ్యక్ష కార్యదర్శులు పెరుమాళ్ళ ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, డాక్టర్ మండల స్వామి, మాదగాని శంకరయ్య, డాక్టర్ టంగుటూరి సైదులు, బండారు శంకర్ అభినందించారు.

నిరుద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి



వాకర్స్‌తో మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

మిర్యాలగూడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపిస్తే పట్టభద్రుల, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్ఎస్‌పీ క్యాంప్ గ్రౌండ్‌లో ఉదయం వాకర్స్‌ను కలిసి మాట్లాడి ఓటు అభ్యర్థించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ 1.70లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. తనను గెలిపిస్తే ఖాళీల భర్తీకి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తానన్నారు. పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఆలోచించి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్, నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, నల్లమోతు సిద్దార్థ, ఎండి.షోయబ్, జొన్నలగడ్డ రంగారెడ్డి, పశ్యా శ్రీనివాస్‌రెడ్డి, రవినాయక్, దినేష్, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, పునాటి లక్ష్మీనారాయణ, కృష్ణ, కరీం, హబీబ్, తిరందాసు విష్ణు, గుడిసె దుర్గాప్రసాద్, రామస్వామి, గౌస్, ఆకారపు సైదులు, రవీందర్ నాయక్, ఫయాజ్, రాంబాబు, ఇమ్రాన్, శ్రవణ్‌రెడ్డి, ఆసిమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగితే కాంట్రాక్టర్‌దే బాధ్యత



కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న కమిషనర్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో వేసిన రోడ్లపై గంతలు పడి ప్రమాదాలు జరిగితే ఆ బాధ్యత పని చేసిన కాంట్రాక్టర్‌దేనని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ కాంట్రాక్టర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీలో డ్రెయినేజీ నిర్మాణాల వద్ద ఏమైనా గుంతలు ఉంటే ఇప్పుడే పూడ్చివేయాలని, వర్షాలుఎ ప్రారంభం అయితే మరింత ఇబ్బందిగా మారుతుందన్నారు. మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన బోరు బావులకు పైపులు బిగించకుండా ఉంటే వెంటనే వాటిని బిగించాలన్నారు. జడ్చర్ల–కోదాడ ప్రధాన జాతీయ రహదారి వెంట రెండుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణాలను చేపట్టి వాడిని పూడ్చిలేదని ఈ గుంతలు తక్షణమే పూడ్చివేయాలని, పూడ్చని గుంతల్లో ఏమైనా ప్రమాదాలు జరిగితే ప్రజలు మున్సిపాలిటీని బాధ్యులుగా చేస్తారని, అందుకు తాము పూడ్చే పనులకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో పలువురు కాంట్రాక్టర్లు తదితరులున్నారు.

పాఠ్యపుస్తకాలను హెచ్‌ఎంలు తీసుకెళ్లాలి



పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠ్య పుస్తకాలను తీసుకెళ్లాలని మండల విద్యాధికారి ఎం. బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం స్థానిక మండల రిసోర్స్ భవనంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వడ్డేపల్లి వెంకటేష్, సత్యపాల్, అనంతరెడ్డి, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, మోడల్ స్కూల్ స్కూల్ ప్రిన్సిపల్ సుజాత, ఉపాధ్యాయులు శ్రీనువాస్, సైదానాయక్ తదితరులున్నారు.

మంచినీటి ట్యాంక్‌పై నిర్లక్ష్యం

- మెట్లపై కూలిన భారీ వృక్షం
- తొలగించని అధికారులు
- కలుషిత నీరు సరఫరా అవుతుందంటున్న గ్రామస్తులు



వాటర్ ట్యాంక్ మెట్లపై కూలిన చెట్టు

త్రిపురారం : మంచినీటి ట్యాంక్‌లపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. దీంతో ట్యాంక్‌ల ద్వారా వచ్చే కలుషిత నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో విద్యానగర్ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా మంచినీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఇదే నీరు సుమారు 500 ఆవాసాలకు ఆధారం. అయితే ఇక్కడి మంచినీటి ట్యాంక్ మెట్లపై భారీ చెట్టు కూలింది. గ్రామంలో సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ట్యాంక్‌ను శుభ్రం చేయకపోవడం వల్ల ట్యాంక్ ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుంది. ఈ ట్యాంక్ ద్వారా వచ్చే నీటిని పాఠశాలలో విద్యార్థులకు వండే మధ్యాహ్న భోజనాలకు వినియోగిస్తున్నారు. ఇక్కడే క్రీడా ప్రాంగణంతో పాటు నిత్యం యోగా చేసుకునే గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. దీంతో కలుసిత నీటి వల్ల అనారోగ్యానికి గురైన పరిస్థితులు ఉన్నాయి. గత కొంత కాలంగా ట్యాంక్ మెట్లపై చెట్టు కూలడంతో ట్యాంక్‌ను శుభ్రం చేయకుండా నీటిని విడుదల చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వేసవి కాలం కావడంతో నీరు అందక కలుషిత నీటిని వాడాల్సిన పరిస్థితి తలెత్తింది. ట్యాంక్ మెట్లను పునరుద్ధరించి ట్యాంక్‌ను శుభ్రం చేసి నీటిని అందించాలని గ్రామస్తుల కోరుతున్నారు.